# జననీ! జన్మ భూమి!

పవని నిర్మల ప్రభావతి

"ఏమిట్రా నువ్వంటున్నది. సుధీర్." కంగారుగా తలెత్తి చూచి అంది పద్మజారావ్!

తనకోసం డైనింగ్ టేబిల్ మీద మూత పెట్టబడివున్న గాజు ప్లేటు, తన దగ్గరగా జరుపుకుంటూ నింపాదిగా అన్నాడు సుధీర్. "రేపు కలెక్టరాఫీసు దగ్గర, సైన్యంలో చేరదల్చుకున్న యువకుల్ని రిక్రూట్ చేస్తారటమ్మా! నేను చేరుతాను!" మరోమారు అర్థమయ్యేలా తల్లికి చెప్పి, చేతిలో చెయ్యి వేసుకున్నాడు సుధీర్.

క్షణకాలం కొడుకు వేపు అయోమయంగా చూచింది పద్మజారావ్! అప్రయత్నంగా ఆమె భ్రుకుటి ముడి వడింది.. అప్పుడప్పుడూ ఇతగాడి కోసం వచ్చే శర్మ, జాన్....వాళ్ళ దుర్బోధ కాదుకదా ఇది? అన్న సంశయం ఆమె అంతరాంతరాల్లో మెరిసి మాయమైంది.

"నీకేమైనా మతి పోయిందా సుధీర్? అలాటి ఖర్మ నీకేంపట్టింది?"

సుధీర్ ఆశ్చర్యంగా తల్లివేపు చూశాడు. "అది ఖర్మా అమ్మా? ఖర్మా? ఇన్ని మహిళా మండలులు స్థాపించావ్! మరెన్నో సంస్థలకు ఆనరబుల్ సెక్రెటరీగా వున్నావ్! ఎంతో ఉత్తేజంగా ఎన్నో ఉపన్యాసాలిస్తావ్! ఎం.ఏ పాసైన నువ్వేనా ఇలా మాట్లాడుతున్నదీ." అత

గాడి ఎర్రని ముఖం చిరుకోపంతో మరి కాస్త ఎరుపుకు తిరటగం చూచి. లోలోపల మురిసి పోయింది పద్మజారావ్! "నా కొడుకు చాలా అందగాడు! అవును మరి నేనెంత అందంగాలేను ఈ వయసులో నైనా?" అందామె మనసు గర్వంగా....

"ఏమిటమ్మా పలకవు? మరి నా పేరెందుకు సుధీర్ అని పెట్టావు?" కోపంగా అరిచాడు సుధీర్.

పద్మజారావ్ ఫక్కున నవ్వింది....

"అసలు రణధీర్ అని పెడదామన్నారు మీ నాన్నగారు .... నాలుగక్షరాల పేరు నాకిష్టంలేక పోయింది ...." ఆ విషయాన్ని, ఆ వాతావరణాన్ని, సహజంగా మార్చాలన్న ధోరణిలో నవ్వుతూనే వుంది ఆమె....

"ఇప్పుడు తమాషాలు కాదమ్మా! నేను రేపు వెళ్లి చేరతాను. తాటిచెట్టల్లే ఇంత పొడుగు పెరిగాను ...నా మజిల్స్ చూడు ఎలా వున్నాయో .... తప్పక సెలెక్టు చేసుకుంటారు .... నాన్నగారు కూడా ఏమీ అనరు ..." సుధీర్ ప్లేట్లో చెయ్యి కడుక్కుంటూ దృఢంగా అన్నాడు....

పద్మజారావ్ తెల్లబోయింది కొడుకు చాలా పట్టుదలగానే వున్నాడన్నది బోధపడింది ...

అతగాడి వెనకాలే, బెడ్ రూంలోకి నడిచింది....బెడ్ మీద కూర్చున్నాడు సుధీర్. కుర్చీలో దగ్గరగా కూర్చుని మెల్లిగా అందామె.... "చూడు నాన్నా! వున్నది నువ్వొక్కడివినాడు........మన ఆస్తి ఎంత వుందో నీకు తెలుసు కదూ? మీ నాన్నగారు ఫారిన్‌లో వున్నారు కదా?....ఆయన గారు రాగానే, ఇక బిజినెస్ అంతా నీకు అప్పగించాలను కుంటున్నారు... నువ్విలా వెళ్లిపోతే....ఇదంతా మేమేం చేసుకోవాలి." ఆమె కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి....

సుధీర్ కలవర పడ్డాడు.... "అదేమిటమ్మా...." అతగాడి మాటలకు అడ్డొస్తూ అంది పద్మజారావ్ "....ఈ వయస్సులో నీ ఆవేశం ఇలాగే వుంటుంది. నాన్నా! కానీ వెళ్లిపోతున్న వయసులో మా ఆవేదన కాస్త అర్థం చేసుకో...."

"మరి దేశం....?"

ఆమె కన్నీళ్లు చప్పున తుడుచుకుంటూ నవ్వింది.... "...దేశం ఏమీ కాదు....దానికోసం చాలామంది వున్నారులే ...ప్రభుత్వాలు మారవచ్చు....మళ్ళీ సర్దుకోవచ్చు .. కానీ ఒక్కసారి ఆస్తీ, అంతస్తూ పోగొట్టుకుంటే తిరిగి అవి సంపాదించుకోలేం నాన్నా! అవి వున్నంత వరకే మనం పరువు మర్యాదలతో గౌరవంగా బ్రతగ్గలం .. నా మాట విను.. బిడ్డగా నిన్నే విషయంలోనూ నొప్పించ లేదు ఇందాకా! ఈ విషయంలో నన్నూ మీ నాన్నగారినీ నొప్పించకు .. నీకంతగా ఓ




షారి అలాతిరిగి రావాలనుంటే. రేపే ఏదేనా "బోయింగ్" లో సీట్ రిజర్వ్ చేయించుకో....అలా అలా తిరిగిరా!"

పద్మజారావ్ లేచి తన గదిలోకి వచ్చేసింది....సుధీర్ మౌనంగా పడుకున్నాడు....

• •

"నీకిదేం పాడు బుద్ధిరా రఘూ! ఏదో ఆ బి.ఏ. కాస్త పూర్తయిందికదాని మేం సంబర పడుతూంటే...." వెంకటరావు గర్జిస్తున్నాడు....

రఘు నేల చూపులు చూస్తున్నాడు....

"ఇప్పుడప్పుడే ఏ ఉద్యోగమూ వచ్చేలా లేదునాన్నా!" నసుగుతూ అన్నాడు....

"....అందుకని సైన్యంలో చేరి వస్తావా?"

"అపశకునపు మాటలూ! మీరూను," రంగంలోకి విశాలాక్షమ్మ రానే వచ్చింది.

"....చేరిన వాళ్ళంతా చావరు నాన్నా!"

"....ఛాల్లేవోయ్ అతితెలివి! రేపు నేనూ నీవెంట వస్తాను. ఆ ఎం ఎల్ ఏ రామారావుగారిని బ్రతిమాలి ఎక్కడో ఓ చోట టెంపరరీగా నైనా, ఓ గుమాస్తాగానైనా వేయమంటాను....అట్టే గొడవ చెయ్యక .... మరో మాటకు అవకాశం ఇవ్వకుండా బయటికి వెళ్ళి పోయాడు వెంకటరావు ...

"ఛీ ...ఓ దేశభక్తి లేదు....ఓ ధైర్యం లేదు....నానిస బ్రతుకు...." పెద్దగా గొణుగుతున్న కొడుకువేపు వాత్సల్యంగా చూచింది విశాలాక్షమ్మ....

"ఆయనకు తిక్క కోపం .... అదే సర్దుకుంటుంది.... అయినా మనకెందుకులే రా రఘూ! సైన్యాలూ వల్లకాదూను ... ఏదో గుమాస్తానో, టీచరో అయితే.... నాలుగు రాళ్లు తీసుకొస్తే....కాస్త మీ నాన్న రెక్క కద్దువస్తావు .... నీకు ఉద్యోగం వస్తే, వచ్చే ఏడాదైనా గిరిజ పెళ్లి చెయ్యాలి....దానికి పద్దెనిమిదేళ్లు నిండిపోతున్నాయి మరి!"

ఆమె వంట ఇంట్లోకి వెళ్లిపోయింది.

రఘు ఆ చిన్న గదిలో ...అలాగే విల్చుండి పోయాడు...

• •

"నేను రేపు సైన్యంలో చేరి పోతా నమ్మా! తిండీ, బట్టా ఇచ్చి, మంచిమంచి జీతాలిస్తారట!" వీరాయి ఉత్సాహంగా చెప్పాడు.

చంద్రమ్మ కళ్లలో ఎంతో, వెలుగు "నిజం.. నర్రా!" అంది....

"నిజంగానే! ఇప్పుడే ఆ ఆఫీసరు దగ్గరకి పోయి మాట్లాడొచ్చాను కూడా! వివరాలన్నీ చెప్పాడు .... రేపు చాలా మందిని తీసుకుంటారట .... వచ్చే నెల నుంచి దండిగా జీతం వస్తుంది.... ఇక్కడికి పంపేస్తాను .... నువ్వు చీరె కొనుక్కో. గురవడికీ, నారిగాడికీ, కాయికీ, లక్ష్మికీ ఇంక ఒంటి నిండా బట్టలూ, కడుపునిండా తిండీ పెట్టు ... అక్కడ నాకు తిండీ బట్టా గడిచి పోతుంది! ఓడుకు దోమ తెరలూ, స్వెట్టర్లూ....చలికి తొడుక్కోనే కోట్లన్న మాట ...ఇస్తారట కూడాను!" సంతోషంగా వీరాయి చెబుతుంటే చంద్రమ్మ మనసు ఆనందంతో తేలికై పోయింది క్షణకాలం. తన చుట్టూరా చిమ్మ చీకటి! రోజు మార్చి రోజు పస్తులు! రోశయ్య ఒక్కడి రెక్కల కష్టం! తనూ కూలీ నాటికి వెళ్తోంది! అయినా కడుపులు నిండటం లేదు! నారిగాడికి పద్నాలుగేళ్లు వస్తున్నాయో ఏమో! వాణ్ణి కూలికి పంపిస్తున్నారు! వాడు మొయ్యలేక, మొయ్య లేక, నరాలు తెంపుకుంటూ బస్తాలు మోస్తుంటే .... తల్లిపేగు తెంపేసినట్టే అవుతోంది! ఒక్కరోజు కూలికి ఒక్కరు వెళ్లకుంటే....రెండో రోజు పస్తే! మరి మానెడు గింజలు రెండు రూపాయలు! పూటకు మానెడు చాలకపోయె!

అంతలోనే గుండెలు పిండివేసే ఆలోచన ఆమె ఎదలో ముల్లులా కదలాడింది.... "సైన్యంలో చేరితే....యుద్ధం వస్తే .... తన బిడ్డ !" ఆ మాటే మెల్లిగా అంది .... వీరాయి ఫక్కున నవ్వాడు.

"యుద్ధంలోగాక ఇక్కడ మాత్రం చావకూడదా ఏమిటే అమ్మా? పస్తులుండి చచ్చేకంటే ...బతికిన నాలుగు రోజులూ నేను హాయిగా తిండి తింటాను....నీకూ, అయ్యకూ, తమ్ముళ్లకూ, చెల్లెలికీ ఇంత తిండి పెడతాను అలాటి మంచి చావు వస్తేమాత్రం ఏం!" నిర్లక్ష్యంగా గుడిసె




బయటికి వెళ్లిపోయాడు .... కొడుకన్న మాటలు రోశయ్యతో చెప్పింది చంద్రమ్మ .... రోశయ్య మీసం మెలేస్తూ గర్వంగా నవ్వాడు "ఆడు! ఆడు నా కొడుకే చంద్రీ! గుండె దెయిర్యం! అది వాడి....!" రాతిలావున్న తన ఛాతీమీద గర్వంగా చేత్తో చరుచుకున్నాడు రోశయ్య .... "అచ్చెర లచ్చలు చేసే మాటన్నాడు నా బిడ్డ! మరివాడు ఏదో తరగతి దాకా చదువుకున్నాడాయె! తెలివీ తేటా ఎట్టాగొచ్చిందో చూడు!"

చంద్రమ్మకు ఆనందమూ, దుఃఖమూ రెండూ కలిగాయి .... అణుచుకుంది.... తెల్లారి లేచేసరికి ఆమెకు ఏ బాధా మిగల్లేదు. కారణం తన చుట్టు పక్కల గుడిసెల్లో చాలామంది వయసు కుర్రవాళ్లు, వీరాయితో బాటు సైన్యంలో చేరటానికి సిద్ధమై వెళ్తున్నారు. అందరి కందరూ వీరాయిలానే మాట్లాడుతున్నారు....

* *

పదేళ్ళు గిర్రున తిరిగాయి....చరిత్ర పుటల్లోకూడా చిత్రవిచిత్రాలు దొర్లుతున్నాయి....

దేశం మారిపోయింది .... మనుషులు మారిపోయారు ... సామాన్యులు మరీ సామాన్యులుగా మారిపోతున్నారు .... గొప్పవాళ్లు మరీ గొప్పవాళ్లుగా మారిపోతున్నారు ... మధ్యతరగతి కుటుంబాలు గానుగెద్దుల్లా .... ఒకే పరిధిలో గిరగిర తిరుగుతున్నాయి ...

సిద్ధిక్ ఇప్పుడు బిజినెస్‌లో మెలకువ

అన్నీ తెలుసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఆస్తిని రెట్టింపుగా పెంచాడు....త్వరలో రాబోయే ఎలక్షన్స్‌లో సమితి ప్రెసిడెంటుగా పోటీ చేయబోతున్నాడు ... భార్య హేమతో ఈ మధ్యే కాశ్మీర్‌కు విలాసయాత్ర కూడా చేసివచ్చాడు. రావుగారూ, పద్మజారావ్ ...చాలా సభలకూ, సమావేశాలకూ గౌరవాధ్యక్షులుగా...వక్తలుగా వెళ్తూ ...కాలం సరదాగానే వెళ్ళబుచ్చుతున్నారు .... ఆనాటి మూర్ఖపుపట్టు వదిలి సుధీర్ ఇలా హాయిగా వున్నందుకు వాళ్లిద్దరూ ఆనందించని క్షణంలేదు. అప్పుడప్పుడూ. తనెలా సుధీర్ మనసు మార్చగలిగిందీ, గర్వంగా కోడలితో చెబుతూంటుంది పద్మజారావ్.

"వుయ్ ఆర్ ఎడ్యుకేటెడ్! అవర్ డ్యూటీ యీజ్ టు డైవర్ట్ దెమ్ టు ఎ గుడ్ పాత్.

అంటుంది నవ్వుతూ....

* *

రఘు ఎనిమిదేళ్లుగా యు.డి.సి. గా వున్నాడు .... భార్య మీనాక్షి స్కూల్ ఫైనల్ పాసై, టైప్ పరీక్షలు పాసైంది. ఇద్దరు పిల్లలు ...త్వరలో మీనాక్షినికూడా ఎక్కడైనా టైపిస్ట్‌గా చేర్పిస్తే తప్ప, గిరిజ పెళ్ళికైన అప్పు తీరేలా తోచటంలే దతగాడికి....సంసారమూ గడిచేలా కనిపించటం లేదు. ఇద్దరు తమ్ముళ్లు వరసగా చదువుకు ఎక్కివచ్చారు. మరో చెల్లాయి ఓణీలు వేస్తోందీ మధ్యే!

సుధీర్‌గారినో, పద్మజారావుగారినో, రావుగారినో....ప్రతిమాలో...మనసు కరిగేలా విన్నవించుకునో....కావలిస్తే మరెవరికైనా....ఓ పదో, పరకో తడి తగిలించో ........ ఎలాగో ఓలా తనకు ప్రమోషనూ, మీనాక్షికి ఉద్యోగమూ వచ్చేలా చూసుకోవాలన్నదే అతగాడికి రాత్రింబగళ్లు ఆలోచనై పోయింది.

వీరాయి చాలా మారిపోయాడు.... వీరారావుగా మారాడు. హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, బెంగాలీ, కన్నడం, తమిళం... ఒకటేమిటి....ఏడెనిమిది భాషల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నాడు....మంచి మంచి పాంట్లు .... ఉలన్ స్వెట్టర్లు .... మంచి తిండీ....ట్రాన్సిస్టరు....వాచీ.... దర్జాగా వుం దతగాడికి...శలవులకు ఇంటికి వచ్చేటప్పుడు చెల్లాయిలకూ, తమ్ముళ్లకూ, తలిదండ్రులకూ చాలా మిఠాయిలూ, బట్టలూ పట్టుకొస్తాడు .... ట్రాన్సిస్టర్ తెస్తాడు .... ఉలన్ స్వెట్టర్లు తెచ్చాడు. కప్పుకొనే రగ్గులు....బిస్కెట్ ప్యాకెట్లు ఒకటేమిటి! అతగాడొచ్చిన పదిరోజులూ అదో పండగగా గడిచిపోతుంది ఇంటిల్లిపాదికీ....గుడిసె పీకించి ఈ మధ్యే చిన్న పెంకుటిల్లు రెండు గదులతో వేయించాడు. తను పంపిన డబ్బుతో!

"నేనూ వీలానే సైన్యంలో చేరతా అన్నా!" అని నారిగాడు అంటే ... "అలాగేరా నారాయణా! మంచిదే చేరుదూ గానీ!" అంటాడు నవ్వుతూ! ఆ నవ్వు




యంలో అతగాడి అంతరాంతరాల్లో మాత్రం "నువ్వు నూరేళ్ళూ నిండుగా బ్రతకాలిరా నారాయణా!" అన్న నిట్టూర్పు రేగి చప్పున చల్లారిపోతుంది. రోశయ్య, చంద్రమ్మ .... కొడుకును చూచుకొనీ, తలుచుకొనీ గర్వపడని క్షణంలేదు.

"నా తండ్రి ఎక్కువవాడు! మాకింక దిగుల్లేదు!" అనుకుంటారు ఇద్దరికిద్దరూ.

అందరూ నిద్రపోయాక అర్ధరాత్రిలో అలా ఆకాశంకేసి చూస్తుంటాడు వీరాయి ఒక్కోసారి. ఆ సమయంలో అతగాడి మనసులో చిత్రవిచిత్రాలైన భావ పరంపరలు మొదలౌతాయి.

"నా వాళ్ళంతా హాయిగా వున్నారు! కడుపునిండా తిండీ, ఒంటినిండా బట్ట, కంటినిండా నిద్ర ఇవ్వగలిగాను. చాలు. నా తల్లి, తండ్రి ...తోబుట్టువులకు నా ఋణం తీర్చుకుంటున్నాను. ఇదెంత హాయిగా వుంది! ఈ సంతోషం... ఈ సంతృప్తి ముందు మరణమన్నది ఎంత? చస్తేమాత్రం ఏం?"

ఆ సంతృప్తితో గుండెలమీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతాడు మరు క్షణంలో.

• •

ఆరోజు శలవులకు ఇంటికొచ్చాడు వీరాయి. వచ్చిన మూడోరోజే కమాండర్ దగ్గర్నుంచి యుద్ధం ప్రారంభం కాబోతోందనీ .... ఉన్న పళాన సెంటర్‌కు రావలసిందనీ టెలిగ్రాం వచ్చింది.

దిగాలు పడిన చంద్రమ్మకు ధైర్యం చెప్పాడు. తండ్రికి కళ్ళతోనే వీడ్కోలు

చెప్పాడు. నవ్వుతూ ట్రెయిన్ ఎక్కాడు. మరి తిరిగిరాలేదు!

యుద్ధం ముగిసింది....

చాలామంది మిలిట్రీ ఆఫీసర్లకూ, పైలట్లకూ, నౌకా దళాధిపతులకూ, బ్రతికివున్నవారికీ, చనిపోయినవారికీ .. వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా మెడల్స్ అందజేయబడుతున్నాయి .... ఆ రోజంతా చనిపోయిన వీరజవానులకు శ్రద్ధాంజలి సమర్పించే సభలు దేశమంతటా జరుగుతున్నాయి.

ఆ సభలో....

సుధీర్ తన పేరుతో సైనిక కుటుంబాల సహాయార్థం నిధి వసూలుచేస్తానని మొదటి విరాళంగా వెయ్యిరూపాయ లిస్తాననీ ప్రకటించాడు.

చాలారోజులుగా రఘు, వెంకటరావు ఇలాటి అవకాశంకోసమే కనిపెట్టుకుని వున్నారు. పెద్దపెద్దవాళ్ళంతా ఒకచోట చేరినపుడే తమ పనులు కాస్త వాళ్ళ చెవిని వేయటం, జౌననిపించుకోవటం మంచిదని ఇద్దరికీ వుంది.

''ఆరోజు నేను వద్దనబట్టి సరిపోయింది! లేకుంటే ఈనాడు నీగతి ఏమైవుండేది! ఈ సభలో నువ్వూ ఓ కీర్తిశేషుడిగా మిగిలిపోదువు!'' అన్నట్లు చూపులు విసురుకున్నాడు వెంకటరావు కొడుకువేపు అప్పుడప్పుడూ.

కండ, గుండె, ఏనాడో చచ్చిన రఘు ''బొనౌను'' అన్నట్లు తలాడిస్తున్నాడు వుంది వుండి—జీవచ్ఛవంలా!

పద్మజారావు నిజంగానే చాలా అలసటగా వుంది! అధ్యక్షోపన్యాసం అయ్యేంత వరకూ....కుర్చీలో వెనక్కు తలవాల్చి రిలాక్స్ అవుతోంది!

విన్నంతా ఆమె చాలా శ్రమపడింది! రోశయ్య, చంద్రమ్మల ఇంటికి స్వయంగా కారులో వెళ్ళింది. ఇద్దరినీ చాలా వివరాలు అడిగింది. వీరాయి పుట్టిన తేదీకాదు కదా, సంవత్సరంకూడా వాళ్ళకి తెలీదన్నారు. ఉజ్జాయింపుగా తనే లెక్కకట్టుకుంది. వాళ్ళిద్దరూ ఏడుస్తూ చనిపోయిన తమ కొడుకును వర్ణిస్తుంటే.... జాగ్రత్తగా అతగాడి ఆకారాన్ని మనసులో గుర్తుంచుకొంది. వీరాయి సెకెండు ఫారం వరకూ చదువుకున్నాడన్నది గుర్తుంచుకొంది... చంద్రమ్మ పేరు.... సైన్యంలో చేరటానికి వెళ్ళేముందు, ఆ తల్లీకొడుకుల సంభాషణా అంతా జాగ్రత్తగా ఏకసంథాగ్రాహిలా మనసులోనే నోట్ చేసుకుంది.

ఇంటికి వచ్చాక .... చరిత్రపుటల్లో మరుగుపడివున్న వీరమాతల పేర్లూ, మరికొన్ని పిట్టకథలూ అన్నీ క్రోడీకరించుకుంది.

రాత్రంతా కూర్చుని చాలా ''ఎమోషనల్'' అయిన స్పీచ్ తయారు చేసుకుంది. పాయింట్సు నోట్ చేసుకుంది. తెల్లారుఝామున ఓసారి మనసులోనే రిహార్సల్స్ వేసుకుంటుంటే, మెలకువ

వచ్చిన రావుగారు ఆశ్చర్యంగా భార్యకేసి చూశారు.

"ఇంకా నిద్ర పోలేదూ? పద్మా?" అన్నారు కంగారుగా.

"ఊహూ! స్పీచ్ ప్రిపేర్ చేసుకున్నాను!" అంది ఆవులిస్తూ.... ఒళ్లు విరుచుకుంటూ.

"అబ్బా! ఏదో నాలుగుముక్కలు చెబితే పోయేదానికి ..ఇంతగా హైరాన పడాలా?" అన్నారాయన నిద్రమత్తులోనే....

"ఊహూ! నాలుగుముక్కలు యెవరేనా చెబుతారు .... నా స్పీచ్ ఎమోషనల్‌గా, మాబ్‌ను అట్రాక్ట్ చేసేదిగానూ, ఇంప్రెస్ చేసేదిగానూ వుండాలి!...ఇలాటి అవకాశం ఎప్పుడోగానీ రాదు! ప్రెస్ రిపోర్టర్స్‌కూడా చాలామంది వస్తారని విన్నాను!...." అలసట సారిడోలటానికి ఓ కప్పు ఓవల్టిన్ తాగి తెలతెలవారబోతూండగా పడుకుంది.

అంచేతే పొద్దుటు నిద్ర ముంచుకవస్తోంది. ఈ రెండు గంటలు కాస్త ఓపికపడితే ఇంటికి వెళ్ళి హాయిగా నిద్రపోవాలి అనుకొంటోందామె కళ్లు మూసుకుని....

" ..శ్రీమతి పద్మజారావు మాట్లాడుతారు."

అధ్యక్షుని గొంతుక ఖంగుమంది మైక్‌లో. పద్మజారావు మెల్లిగా లేచి మైక్ ముందుకొచ్చింది. ఆమెలో వున్న సహజమైన అలసట....ఆ సన్నివేశంలో ఆమె ముఖంలో శోకరసాన్నికూడా ప్రతిబింబించేలా చేసింది.

"మన వీరాయి .... వీరారావు .... సైన్యంలో చేరిన మరునాడు నా దగ్గరకు వచ్చి "అమ్మగారూ! ఇలా చేరాను" అని చెప్పినప్పుడు నేను భుజం తట్టాను. ఆ బిడ్డ ..ఈ గడ్డమీద పుట్టిన మన ఆ బిడ్డ ఇంతటి వాడౌతాడనీ, దేశాన్ని రక్షించే పవిత్ర కార్యక్రమంలో తను అమరుడౌతాడనీ, ఆనాడు నేను కలలో కూడా అనుకోలేదు! తల్లిగాని నాకే ఈనాడు గుండె పగిలిపోతుంది. మరి తల్లి చంద్రమ్మ ఎలా భరిస్తోందో ఈ రంపపు కోత! అయితే ఆమె వీరమాత! జిజియాబాయిలాటి మహాతల్లి. ఆ తల్లికన్న ఈ బిడ్డ మన జిల్లాకేకాదు, రాష్ట్రానికే ఒక మణిపూస.

"సుధీర్ చేరుతానన్నాడు చేరమన్నాను. తీరా ఆ రాత్రే వాళ్ల నాన్నగారికి సుస్తీగా వున్నట్లు తెలిపి ఫారిన్ వెళ్లాల్సి వచ్చింది! వచ్చాక ప్రజాసేవ చేసితీరాలంటూ పెద్దలు పట్టుపట్టారు. అంచేత మా సుధీర్‌కు "రణధీర్" అయ్యే అవకాశం లేకపోయింది. నాకూ వీరమాత అనిపించుకొనే అర్హత లేకపోయింది.

"ఆ గౌరవం, ఆ అర్హత శ్రీమతి చంద్రమ్మకు దక్కాయి. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్నారు పెద్దలు. జన్మభూమి ఋణం తీర్చుకున్న

వీరారావు అజరుడు, అమరుడు.''

ఇలా గంగాప్రవాహంలా గంటసేపు సాగిందామె ఉపన్యాసం. మధ్యమధ్యలో వీరారావుతో తన సాన్నిహిత్యం, సంభాషణలు. నిన్నరాత్రి అందంగా ఊహలతో తయారుచేసుకున్నవన్నీ సమయోచితంగా ఉదహరించింది.

జనం చాలా ఇంప్రెస్ అయ్యారు ఆమె ఉపన్యాసంతో. ఆ తర్వాత చాలా మంది పెద్దలు వీరారావును పొగిడారు. చివరగా చంద్రమ్మను వేదికమీ కి పిల్చి వెయ్యిరూపాయల చెక్కు అందించారు.

ఆ రాత్రి .... అర్ధరాత్రి .... గాఢాంధకారం ...

సుధీర్, హేమ కౌగిలిలో వెచ్చగా నిద్ర పోతున్నాడు ...

రఘు ...మీనాక్షి .. వెంకటరావు .... విశాలక్షమ్మ .... ఎవరికి వారుగా ... త్వరలో రఘుకు రాబోయే ప్రమోషన్ గురించీ ...మీనాక్షికి రాబోయే ఉద్యోగం గురించీ .... కలలు గంటూ గురకలు కొడుతున్నాడు ...

ఆ చిమ్మ చీకటిలో....ఆ చిన్న పెంకుటింట్లో . రోశయ్య నులక మంచంమీద కాళ్లు కిందకు వేసి కూర్చునివున్నాడు.... అతగాడి కాళ్ళమీద తలపెట్టి చంద్రమ్మ ఏడుస్తోంది. ఆమె వెచ్చటి కన్నీళ్లు అతగాడి మోకాళ్ళ మీద బరువుగా పడుతున్నాయి....అతగాడి రాతిలాటి ఛాతీ కరిగి నీరౌతోంది....

''చంద్రీ! ఈ ఇల్లూ ఆడే కట్టించాడు గదే! మనకడుపున బుట్టి ...మనగుడిసెలో పుటిన మన బిడ్డ ఎంత గొప్పోడైనాడో చూచావూ? పెద్ద పెద్దోల్లంతా అణ్ణి ఎట్టా మెచ్చుకున్నారో చూచావూ! ఎంత పున్నెం చేసుకున్నామో! అంత పాపమూ చేసుకున్నాం! మనోడు మనకు దక్కలేదు?'' అన్నాడు రోశయ్య ..

అతగాడి కంఠస్వరం పూడుకుపోయింది ...

చంద్రమ్మ వెక్కిళ్లు పెడ్తూ అంది.... ''ఆ పెద్దోల్ల మాటలేమీ నాకర్ధం గాలేదు. గానీ .... నా బిడ్డ ... బతికిన నాలుగు రోజులూ... మన ఋణం తీర్చుకున్నాడు. చచ్చాక కూడా . వెయ్యిరూపాయలు.... ఒక్క సంవత్సరం తిండి మనకోసం.... ఇచ్చి పోయాడు .. మన ఋణం తీరేసుకునీ వెళ్ళి పోయాడు !'' ఆమె గుండె ఎగసి ఎగసి పడుతోంది ఆమె మాతృప్రేమ వరదలై పారుతోంది .... దేశం ఏమిటో....దేశభక్తి ఏమిటో ఆమెకీక్షణం లోనూ తెలియవు .... తెలిపిందల్లా .... ఆకలీ... దాని క్రింద కప్పివేయబడి వున్న మాతృ మమత ఈ క్షణంలో ఆకలి పొర తొలిగి .... మమత .... ఒక్కటే దహించి వేస్తోంది ...మరి కొద్ది రోజుల్లో నారాయణ కూడా ఆ కటిక చీకటిలో ఆమె తల విదుల్చు కొంటోంది పిచ్చి దానిలా!